## అంబేద్కర్ ఓవర్సీస్ విద్యానిధికి ఎస్సీవిద్యార్థుల దరఖాస్తుల ఆహ్వానం

-షెడ్యూల్డు కులాల అభివృద్ధి అధికారిణి విజయలక్ష్మి

**మెదక్ టౌన్, ఆగస్టు 2, ప్రభాతవార్త:**
మెదక్ జిల్లాలోని విదేశీ విశ్వవిద్యాలయాల్లో పోస్టు గ్రాడ్యుయేషన్ కోర్సుల్లో చదవాలనుకుంటున్న షెడ్యూల్డ్ కులాల (ఎస్సీ)విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా షెడ్యూల్డు కులాల అభివృద్ధి అధికారిణి విజయలక్ష్మి శనివారం ఒకప్రకటనలో తెలిపారు. 2025-26 విద్యాసంవత్సరానికి తెలంగాణ ప్రభుత్వం విదేశీ విద్యాలయాల్లో ఉన్నతవిద్యను అభ్యసించేందుకు షెడ్యూల్డ్ కులాల అభివృద్ధిశాఖ ద్వారా నిర్వహిస్తున్న అంబేద్కర్ ఓవర్సీస్ విద్యానిధిపథకం ద్వారా షెడ్యూల్డు కులాలకు చెందిన విద్యార్థులకు రూ.20లక్షలు స్కాలర్షిప్‌లు అందించేందుకు నిర్ణయించినట్లు తెలిపారు. ఆగస్టు 31వ తేదీ లోపు వెబ్‌సైట్‌లో విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఎంపికైన విద్యార్థులకు రూ.20లక్షలతో పాటు, వీసా, టికెట్ ఫేర్‌ను కూడా మంజూరు చేస్తామన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.



మెదక్ | సంగారెడ్డి | సిద్దిపేట
వార్త

## నేడు రాష్ట్ర కార్మికశాఖ మంత్రి వివేక్ రాక

**గజ్వేల్, ఆగస్టు 2, ప్రభాతవార్త:**
రాష్ట్ర కార్మికశాఖ మంత్రి గడ్డం వివేక్‌వెంకటస్వామి గజ్వేల్ నియోజకవర్గంలో ఆదివారం పర్యటిస్తున్నట్లు జిల్లా కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షుడు తూంకుంట నర్సారెడ్డి పేర్కొన్నారు. శనివారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర కార్మికశాఖ మంత్రి గడ్డం వివేక్‌వెంకటస్వామి గజ్వేల్ నియోజకవర్గ పరిధిలో రేషన్ కార్డుల పంపిణీ కోసం విచ్చేస్తున్నట్లు తెలిపారు. ఉదయం 8గంటలకు గజ్వేల్‌లోని వర్గల్ కమాన్ నుండి ర్యాలీగా వెళ్ళి శాకారం టిజిఆర్ ఫంక్షన్‌హాల్‌లో లబ్దిదారులకు రేషన్ కార్డుల పంపిణీ, అక్కడి నుండి 9 గంటలకు గజ్వేల్ మున్సిపాలిటీ పరిధిలోని ముట్రాజ్‌పల్లి రింగ్‌రోడ్డు వద్ద ఎస్‌ఎం గార్డెన్‌లో రేషన్‌కార్డుల పంపిణీ, అనంతరం 10గంటలకు జగదేవ్‌పూర్‌లోని కేశిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి ఫంక్షన్‌హాల్‌లో, 11గంటలకు మర్కుక్‌లోని రైతువేదికలో, 12గంటలకు ములుగులోని కెఎన్‌ఆర్ ఫంక్షన్‌హాల్‌లో రేషన్‌కార్డులు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. అనంతరం 1గంటకు ములుగు మండలపరిధిలోని ఆర్టికల్చర్ విశ్వవిద్యాలయం ఆవరణలో భోజనం చేయడం జరుగుతుందన్నారు. ఈకార్యక్రమానికి గజ్వేల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు.

## గంజాయి విక్రయిస్తున్న మహిళ అరెస్టు




పోలీసుల అదుపులో గంజాయి విక్రయిస్తున్న మహిళ

**గజ్వేల్, ఆగస్టు 2, ప్రభాతవార్త:**
గంజాయిని విక్రయిస్తున్న మహిళను శనివారం కోహీర్ పోలీసులు అరెస్టు చేశారు. కోహీర్ ఎస్ఐ నరేష్ కథనం ప్రకారం..కోహీర్ పట్టణంలోని బార్వాడి వీధికి చెందిన కనీజ్‌ఫాతిమా (50) గుట్టుచప్పుడు కాకుండా గంజాయిని విక్రయించడంతోపాటు తన ఇంటిపరిసరాల్లో గంజాయి మొక్కలను పెంచుతున్నట్లు గుర్తించామన్నారు. కనీజ్‌ఫాతిమా ఇంటిని తనిఖీచేయగా గంజాయి విత్తనాలు, 20గ్రాముల ఎండుగంజాయితోపాటు గంజాయిమొక్కలను స్వాధీనంచేసుకుని కేసు నమోదు చేసి కనీజ్‌ఫాతిమాను అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించామన్నారు.

## ఇసుక ట్రాక్టర్ల సీజ్




ఇసుక ట్రాక్టర్లన్ సీజ్ చేసిన దృశ్యం

**కోహెడ, ఆగస్టు 2, ప్రభాతవార్త:**
మండల పరిధిలోని గుండారెడ్డిపల్లి శివారులోని మోయతుమ్మెద వాగు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను శనివారం ఎస్ఐ అభిలాష్ సీజ్ చేశారు. అనంతరం తదుపరి చర్యల నిమిత్తం తహసీల్దార్‌కు అప్పగించినట్లు తెలిపారు. అక్రమ ఇసుక రవాణా చేస్తున్న వారిపై కేసు నమోదుచేసినట్లు వివరించారు. ఇసుక అక్రమరవాణాజరిపితే కఠినచర్యలు తీసుకుంటామని ఎస్ఐ అభిలాష్ హెచ్చరించారు.

## మోటార్‌సైకిల్‌కు నిప్పటించిన గుర్తుతెలియని వ్యక్తులు

**నంగునూర్, ఆగస్టు 2, ప్రభాతవార్త:**
మండల పరిధిలోని తిమ్మాయిపల్లి గ్రామ పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తున్న ఎండి గౌసొద్దీన్ ఎపి23ఆర్1196 నంబరుగల మెటార్ సైకిల్‌ను శనివారం గుర్తుతెలియని వ్యక్తులు పెట్రోల్‌పోసి నిప్పటించారని ఎస్ఐ తెలిపారు. గ్రామ పంచాయతీ కార్యదర్శి తన మోటార్ సైకిల్‌ను వైకుంఠధామం వద్ద నిలిపి లోనికివెళ్లి నర్సరీ పనులు చేసేలోపే గుర్తు తెలియని వ్యక్తులు పెట్రోల్‌పోసి నిప్పటించడంతో బాధితుని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.




కాలిపోయిన మోటార్ సైకిల్

## హత్యగా మారిన వ్యక్తి అదృశ్యం కేసు

-నిందితులను పట్టుకున్న ములుగు పోలీసులు



నిందితుల వివరాలు తెలుపుతున్న గజ్వేల్ రూరల్ సిఐ మహేందర్‌రెడ్డి

**ములుగు, ఆగస్టు 2, ప్రభాతవార్త:**
ములుగు పోలీస్‌స్టేషన్ పరిధిలో ఓవ్యక్తి అదృశ్యమైన కేసు హత్యకేసుగా మారడంతో పోలీసులు వివిధ రకాలుగా దర్యాప్తు జరిపి నిందితులను పట్టుకున్న సంఘటన ఇది. గజ్వేల్ రూరల్ సిఐ మహేందర్‌రెడ్డి, ములుగు ఎస్ఐ విజయ్‌కుమార్‌లు తెలిపినవివరాల ప్రకారం ములుగు గ్రామానికి చెందిన తీగుళ్ల నెహ్రూ(35) అనేవ్యక్తి గతనెల 28న ఉదయం ఐకెపి కార్యాలయానికి వెళ్లి తిరిగి రాకపోవడంతో కుటుంబసభ్యులు ములుగు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా అదృశ్యమైనట్లు కేసు నమోదుచేసి దర్యాప్తు ప్రారంభించారు. ప్రాథమిక దర్యాప్తులో సిసి ఫుటేజీ, కాల్ డేటా విశ్లేషణ, సాంకేతిక ఆధారాలతో నిందితులను గుర్తించినట్లు తెలిపారు. ఈకేసులో ప్రధాన నిందితుడు వర్గల్ మండలం మజీద్‌పల్లి గ్రామానికి చెందిన గామిలీపురం మహేష్ కాగా ఇతనికి 2011లో పిడిచెట్ గ్రామానికి చెందిన స్వప్న అనే మహిళతో వివాహం జరిగింది. వారికి ముగ్గురు కుమార్తెలు ఉండగా వీరిలో ఒకరు కొండపాక సోషల్‌వెల్ఫేర్ రెసిడెన్షియల్‌పాఠశాలలో చదువుతుండగా అక్కడ పిఇటిగా పనిచేస్తున్న నిషారాణితో మహేష్‌కు పరిచయం ఏర్పడింది. వీరి మధ్య పరిచయం తరచూ ఫోన్‌కాల్స్, వాట్సాప్ మెస్సేజ్‌లద్వారా సాగి, తరువాత వివాహేతర సంబంధంగా మారిందని తెలిపారు. నిషారాణి కూడా వివాహితురాలే. 2019లో మహేష్‌కు ములుగు ఐకెపి సెంటర్‌లో పనిచేసే తీగుళ్ల నెహ్రూతో పరిచయం ఏర్పడింది. వీరిద్దరూ కలిసి చిట్‌ఫండ్ లావాదేవీల్లో పాల్గొంటూ, వ్యక్తిగత విషయాలు కూడా పంచుకునేవారు. నెహ్రూకి కొంతమంది మహిళలతో వివాహేతర సంబంధాలు ఉన్న విషయం కూడా మహేష్‌కు తెలియడం వల్ల మహేష్ అసూయ పెంచుకున్నాడు. అయితే ఇటీవల చిట్‌ఫండ్ కమిషన్ విషయంలో విభేదాలు ఏర్పడడంతో నెహ్రూ అనేకసార్లు కమిషన్ మొత్తాన్ని తను ఒంటరిగా తీసుకోవడం, నిషారాణిపై అసభ్యంగా మాట్లాడడం, ఆమెతో శారీరక సంబంధం కోరినట్లు వ్యాఖ్యలు చేయడం వల్ల మహేష్ తీవ్రంగా కోపం పెంచుకున్నాడు. గత నెల 28న నిషారాణి వద్ద ఉన్న బంగారాన్ని మహేష్ తీసుకొని మైక్రోఫైనాన్స్‌లిమిటెడ్ వర్గల్ బ్రాంచ్‌లో రూ.58,600 రుణం తీసుకున్నాడు. ఆ డబ్బును చిట్‌ఫండ్ బాకీల కోసం వినియోగించనున్నట్లు ఆమెకు చెప్పినా ఆమె నమ్మలేదు. అందుకే నెహ్రూను హామీదారుగా తీసుకురావాలని ఆమెచెప్పింది. ములుగువద్ద నెహ్రూను కారులో తీసుకొని నిషారాణి ఇంటికి వెళ్ళారు. అక్కడ నెహ్రూ మళ్ళీ అసభ్య వ్యాఖ్యలు చేయడంతో మహేష్ కోపంతో అతన్నికొట్టడంతో అపస్మారకస్థితికిచేరాడు. వెంటనే ఇంట్లో ఉన్న వైర్‌తో గొంతు నులిమి హత్య చేశాడు. మృతదేహాన్ని కారులో పెట్టుకొని బయటకు తీసుకెళ్ళాడు. అనంతరం నిషారాణికి విషయం తెలియజేసి ఆమె తండ్రి నారదాసు కొమురయ్య సాయంతో మృతదేహాన్ని దాచేందుకు గాగిల్లాపూర్‌గ్రామానికి వెళ్ళాడు. మొదట మృతదేహాన్ని పొలాల్లోదాచి తర్వాత సరైన వాహనం లభించిన తరువాత మృతదేహాన్ని రాళ్లతోకట్టి చెరువులోపడవేశాడు. ఉబ్బని వినయ్ అనేవ్యక్తి నెహ్రూ ఫోన్‌నుండి ఆయన భార్యకు ఫేక్‌కాల్‌చేసి అన్నరాడు, రేపువస్తాడు అనిచెప్పాడు. నిందితుడు మహేష్ నెహ్రూ భార్యకు రూ.15వేలు చిట్‌ఫండ్ డబ్బును ఇచ్చి అతను బాగానే ఉన్నట్లు నమ్మించడానికి ప్రయత్నించాడు. హత్య అనంతరం మహేష్ నెహ్రూ యొక్క మొబైల్‌ను ములుగు కొండపోచమ్మ కెనాల్‌లో పడేసి ట్రేస్ కాకుండా జాగ్రత్త పడ్డాడు. స్వయంగా పోలీసులకు మృతదేహాన్ని పడవేసిన ప్రదేశాన్ని, నిషారాణి నివాసాన్ని చూపించినట్లు తెలిపారు. నిందితుల వద్ద నుండి రెండు కార్లు, నాలుగు మొబైల్ ఫోన్‌లు, ఒక టివిఎష్ ఎక్సల్, మైక్రో ఫైనాన్స్‌లో తీసుకున్న రుణపు రసీదు, నెహ్రూ మొబైల్ కాల్ ట్రేసులు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. హత్య కేసులో ప్రధాన నిందితుడు గామిలీపురం మహేష్ సహా నిందితులు నిషారాణి, ఉబ్బని వినయ్, నారదాసు కొమురయ్యలను అరెస్ట్ చేసి కోర్టులో ప్రవేశపెట్టినట్లు తెలిపారు.

# కోదండ రామాలయం కోసం ఎక్కడికైనా వస్తాం

-ఎంపి రఘునందన్‌రావు

**మెదక్ టౌన్, ఆగస్టు 2, ప్రభాతవార్త:**
మెదక్‌పట్టణంలోని శ్రీకోదండ రామాలయంలోని హుండీ, ఫంక్షన్‌హాల్‌కు శనివారం దేవాదాయ ధర్మాదాయశాఖాధికారులు సీల్‌వేశారు. విషయం తెలుసుకున్న మెదక్ ఎంపి రఘునందన్‌రావు కోదండ రామాలయానికి చేరుకొని మాట్లాడారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఉన్నప్పుడు 2008వ సంవత్సరంలో మెదక్‌పట్టణంలోని వేణుగోపాల స్వామి దేవాలయాన్ని దేవాదాయ, ధర్మాదాయ శాఖలో కలిపారని, కానీ ఇప్పటివరకు ఆ ఆలయం ఎలాంటి అభివృద్ధి చెందలేదని, కనీసం ధూపదీప నైవేద్యాలకు సైతం నోచుకోలేదన్నారు. దేవాదాయ శాఖ పరిధిలోని దేవాలయాల్లో ధూపదీప నైవేద్యాలకు ఇవ్వాల్సిన డబ్బులు కూడా ఇవ్వడం లేదన్నారు. నివేదికలో ఏదైనాతప్పుంటే చూడాలని, ఏదైనా అవకతవకలు జరిగితే లెక్కలు అడగాలన్నారు. కమిటీలు బాగోలేకపోతే రెండేళ్లకు, మూడేళ్లకొకసారి మార్చుకోవాలి తప్ప ఏదో కుంటిసాకు చూపించి, కోదండరామాలయాన్ని దేవాదాయ ధర్మాదాయశాఖ అధీనంలోకి తీసుకోవాలని చూస్తే జగత్‌రక్షకుడు శ్రీరామచంద్రుడు తన ఆలయాన్ని ఆయనే కాపాడుకుంటాడని అన్నారు. రామాలయం కోసం ఎక్కడిదాకైనా వస్తామని, శ్రీరామచంద్రుడి పేరుపెట్టుకున్నందుకు రామాలయం దేవాదాయశాఖ అధీనంలోకివెళ్లకుండా ఎంపి రఘునందన్‌రావు నిలబడతాడన్నారు. కోదండ రామాలయంనుంచి రాందాస్ చౌరస్తావరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో రామాలయకమిటీ బాధ్యులు, హిందూ సంఘాల నాయకులు, బిజెపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపి రఘునందన్‌రావు

# హత్నూర రేషన్ కార్డుల పంపిణీలో గందరగోళం

☛కాంగ్రెస్, టిఆర్‌ఎస్ నాయకుల తోపులాట, వాగ్వి వాదం ☛సిఎం చిత్రపటం చించివేత, భారీ పోలీసు బందోబస్తు
☛బిఆర్‌ఎస్ పార్టీ నాయకులపై పిఎస్ లో ఫిర్యాదు చేసిన కాంగ్రెస్ నాయకులు




సమావేశంలో తోసుకుంటున్న కాంగ్రెస్, బిఆర్‌ఎస్ పార్టీల నాయకులు

**హత్నూర, ఆగస్టు 2, ప్రభాతవార్త:**
హత్నూర మండలంలో శనివారం జరిగిన రేషన్‌కార్డుల పంపిణీకార్యక్రమంలో గందరగోళం జరిగింది. కాంగ్రెస్, బిఆర్‌ఎస్ పార్టీల నాయకుల తోపులాటలు, నినాదాలు, ప్రతినినాదాలు, ఉద్రిక్తతల మధ్య కార్యక్రమం జరిగింది. కార్యక్రమానికి ముందే పటాన్‌చెరు డిఎస్‌పి, జిన్నారం సిఐ, సర్కిల్ పరిధిలోని ఎస్ఐలు, పూర్వ ఎస్ఐలు, ప్రత్యేక పోలీస్‌బలగాలతో పెద్ద ఎత్తున బందోబస్తు ఏర్పాట్లు చేశారు. కాంగ్రెస్, బిఆర్‌ఎస్ నాయకుల మధ్య గొడవలు జరగకుండా ఆపలేకపోయారు. ఇరు పార్టీల నాయకుల తోపులాటలు నినాదాలతో సమావేశ ప్రాంగణం కొద్దిసేపు ఉద్రిక్తంగా మారింది. సమావేశ ప్రారంభానికి ముందు కాంగ్రెస్‌పార్టీ నాయకులు సిఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న సమయంలో కాంగ్రెస్, బిఆర్‌ఎస్ పార్టీ నాయకుల మధ్య తీవ్ర వాగ్వివాదం జరిగింది. సిఎం చిత్రపటానికి పాలాభిషేకం చేయడానికి కాంగ్రెస్ నాయకులు ప్రయత్నించడం, దాన్ని నిలువరించడానికి బిఆర్‌ఎస్ నాయకులు ప్రయత్నించడంతో, ఇరువర్గాలమధ్య తీవ్రతోపులాట, వాగ్వివాదం చోటుచేసుకుంది. ఇదే సమయంలో సిఎం చిత్రపటం సగం చిరిగిపోయింది. దీనితో కాంగ్రెస్ బిఆర్‌ఎస్ నాయకుల మధ్యన తీవ్ర వాగ్వివాదం చోటు చేసుకుని పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. బిఆర్‌ఎస్ పార్టీ నాయకులు సిఎం డౌన్‌డౌన్ అంటూ నినాదాలు ఇవ్వగా, కాంగ్రెస్‌పార్టీ నాయకులు బిఆర్‌ఎస్ డౌన్‌డౌన్ అంటూ నినాదాలు ఇచ్చారు. పోలీసులు రంగప్రవేశంచేసి నినాదాలు చేస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులను సమావేశ మందిరం నుండి బలవంతంగా బయటికితీసుకెళ్లారు. సమావేశం జరిగిన హాల్ తలుపులు మూసివేసి పోలీసుల పహారా మధ్య రేషన్‌కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని అధికారులు చేపట్టారు. రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం పూర్తి అయ్యేంతవరకు కాంగ్రెస్ పార్టీ నాయకులను, కార్యకర్తలను ఎవ్వరినీ సమావేశం జరిగే హాల్లోకి పోలీస్‌లు అనుమతించలేదు. తీవ్ర నిరాశకుగురైన కాంగ్రెస్ పార్టీ నాయకులు పోలీసులతో వాగ్వివాదానికి దిగారు. అధికారపార్టీ నాయకులైన తమను సమావేశానికి అనుమతించకుండా అడ్డుకోవడం ఎంతవరకుసమంజసం అంటూ పోలీసులతో వాదనకు దిగారు. సిఎం చిత్రపటాన్ని చించినవారిపై, కాంగ్రెస్‌పార్టీ నాయకులు హత్నూర పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదుచేశారు. విషయం తెలుసుకున్న వివిధ గ్రామాలకు చెందిన ఆయాపార్టీ నాయకులు, కార్యకర్తలు పోలీస్‌స్టేషన్‌కు చేరుకున్నారు.

# శరవేగంగా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు

☛అంగన్వాడీ కేంద్రాలు, ప్రాథమిక పాఠశాలల బలోపేతానికి కృషి.. ☛మండలంలో కలెక్టర్ సుడిగాలి పర్యటన..

**రామాయంపేట, ఆగస్టు 2, ప్రభాతవార్త:**
ఇందిరమ్మ ఇళ్లనిర్మాణాలు శరవేగంగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని, అలాగే అంగన్‌వాడి కేంద్రాలలో ఆటపాటల ద్వారా పూర్వ ప్రాథమిక విద్యాకార్యక్రమాలను నిర్వహించాలని జిల్లాకలెక్టర్ రాహుల్‌రాజ్ తెలిపారు. జిల్లాలో అంగన్‌వాడీలు, ప్రాథమికపాఠశాలలు బలోపేతం చేసేదిశగా కృషి చేయాలని, గ్రామంలో పరిసరాల పరిశుభ్రత ఫ్రైడే డ్రైడే పటిష్టంగా అమలుచేయాలన్నారు. శనివారం ఆయన రామాయంపేటలో విస్తృతంగా పర్యటించారు. రామాయంపేటమండలం దంతిపల్లిగ్రామంలో అంగన్‌వాడీ ప్రాథమిక పాఠశాల ఇందిరమ్మ ఇళ్లు, పరిసరాల పరిశుభ్రతపై కలెక్టర్ పలు సూచనలు చేశారు. ఇందిరమ్మ ఇళ్లనిర్మాణాలు శరవేగంగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవడంతోపాటు అంగన్‌వాడీకేంద్రాలు ప్రాథమికపాఠశాలల బలోపేతానికికృషిచేస్తున్నట్లు జిల్లాకలెక్టర్ రాహుల్‌రాజ్ తెలిపారు. మండలంలో సుడిగాలి పర్యటన చేసిన కలెక్టర్ ముందుగా దంతిపల్లి గ్రామంలో ఉన్న అంగన్‌వాడీ సెంటర్ ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేశారు. అంగన్వాడీకేంద్రంలో చిన్నారులకు ఆటపాటల ద్వారా అందుతున్న విద్యా బోధనలను అంగన్‌వాడీ టీచర్లను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఇందిరమ్మ ఇళ్లనిర్మాణపనుల పురోగతిని పరిశీలించి, గ్రామాలలో పరిసరాల పరిశుభ్రత ఫ్రైడే కార్యక్రమంపై అధికారులకు పలు సూచనలు చేశారు. గ్రామంలోని ప్రాథమిక పాఠశాలను, ఆతర్వాత అంగన్‌వాడీకేంద్రాన్ని సందర్శించి, చిన్నారులతో కలెక్టర్ కాసేపు ముచ్చటించారు. చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాలకు పంపేందుకు ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని కలెక్టర్ సూచించారు. పిల్లలకు మెనూ ప్రకారం పౌష్టికాహారంఅందిస్తూ, ఆటపాటలద్వారా పూర్వప్రాథమికవిద్యా కార్యక్రమాలను నిర్వహించాలని అంగన్‌వాడీ టీచర్‌ను ఆదేశించారు. ఇందిరమ్మ ఇళ్లనిర్మాణాలను పరిశీలించి... లబ్దిదారులు అందరూ ఇంటి నిర్మాణం చేపట్టేలా క్షేత్రస్థాయిలో పర్యవేక్షణజరపాలని సూచించారు. ఇసుక, మొరం ఎక్కడినుండితీసుకొస్తున్నారు? ఏమైనాఇబ్బందులు ఎదురవుతున్నాయా? అని లబ్దిదారులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు పంచాయతీ సెక్రటరీలు సమావేశాన్ని ఏర్పరచుకొని త్వరగా నిర్మాణాల ప్రక్రియ జరిగేలా చూడాలన్నారు. దశలవారీగా పూర్తిఅవుతున్న నిర్మాణాలకుసంబంధించిన ఫోటోలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని, లబ్దిదారులకు త్వరగా నగదుజమఅయ్యేలా చూడాలన్నారు. గ్రామాలలో ఫ్రైడే డ్రైడే పటిష్టంగా అమలు కావాలని కలెక్టర్ పలు సూచనలు చేస్తూ ప్రజలు వ్యక్తిగత శారీరక పరిసరాల పరిశుభ్రతపై దృష్టి సారించాలన్నారు. నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకుంటూ, దోమలుపుట్టకుండా కుట్టకుండా చూసుకోవాలన్నారు. సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం అనిచెప్పారు. కలెక్టర్‌వెంట సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



ఇందిరమ్మ ఇళ్ళను పరిశీలిస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

## విధులు నిర్వర్తించకుంటే చర్యలు తప్పవు

-అనుమతిలేనిదే సెలవులు మంజూరు చేయొద్దు
-కొమురవెల్లి మండలంలో పర్యటించిన కలెక్టర్



ఇందిరమ్మ ఇళ్లనిర్మాణాలను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ హైమావతి

**కొమురవెల్లి, ఆగస్టు 2, ప్రభాతవార్త:**
డాక్టర్ నుంచి అటెండర్ వరకు ప్రతి ఒక్కరూ విధులు సక్రమంగా నిర్వహించాలని లేదంటే కఠినచర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ కె.హైమావతి హెచ్చరించారు. శనివారం ఆమె మండలంలో పర్యటించి ఆకస్మికతనిఖీలు నిర్వహించారు. ఈసందర్భంగా మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి ఓపి రిజిస్టర్ పరిశీలించి మెడికల్ ఆఫీసర్ సెలవులపై ఆరాతీశారు. సిద్దిపేట డిఎంఅండ్‌హెచ్‌ఓకు ఫోన్‌చేసి అనుమతిలేని సెలవులనురద్దుచేయాలని ఆదేశించారు. అనంతరం మండలకేంద్రానికి చెందిన పరశురాములు గొర్రెలకు బ్లూటాంగ్‌వ్యాక్సిన్ టీకాలు అందించేప్రక్రియను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను సందర్శించి మధ్యాహ్న భోజనం పరిశీలించి మెనూ ప్రకారం నాణ్యమైన భోజనాన్ని విద్యార్థులకు అందించాలని ఆదేశించారు. అనంతరం మండల కేంద్రంలోని ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను పరిశీలించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఇల్లు నిర్మించుకోవాలన్నారు. అగ్రోస్ రైతుసేవా కేంద్రాన్ని పరిశీ లించారు. భూవిస్తీర్ణంప్రకారమే ఎరువులు అందజేయాలని, ఇష్టానుసారంగా ఎరువులు ఇస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. ఎరువులు అక్రమంగా విక్రయం జరిపితే ఉపేక్షించేది లేదన్నారు. ఆమె వెంట ఎంపిడివో శ్రీనివాస్‌వర్మ, పంచాయతీ అధికారులు ఉన్నారు.

## ఈటల రాజేందర్‌కు కలిసిన అరుణ్‌రాజ్ శేరికార్



బిజెపి ఎంపి ఈటల రాజేందర్‌కు కలిసిన అరుణ్‌రాజ్ శేరికార్

**సిర్గాపూర్, ఆగస్టు 2, ప్రభాతవార్త:**
హైదరాబాద్‌లోనీ ధర్నాచౌక్ ఇందిరాపార్క్‌వద్ద బిజెపి ఓబిసిమోర్చా ఆధ్వర్యంలో బిసిలకోసం శనివారం ధర్నా చేయడం జరిగిందని ఓబిసి మోర్చా రాష్ట్ర ఈసి సభ్యులు అరుణ్‌రాజ్ శేరికర్ తెలిపారు. కాంగ్రెస్ తెలం గాణ ప్రభుత్వం బిసిలపై కపటప్రేమ చూపుతుం దని, బిసిలకు బిజెపి పూర్తిస్థాయిలో మద్దతు ఇస్తోందని ధర్నా కార్యక్రమం నిర్వహించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో నారాయణఖేడ్ మండలాధ్యక్షులు దశరథ్ కురుమ, సిర్గాపూర్ మండల ఎస్సి మోర్చా అధ్యక్షుడు గైని రాజు హాజరైయ్యారు.

## ధర్నాను జయప్రదం చేయండి

**పాపన్నపేట, ఆగస్టు 2, ప్రభాతవార్త:**

ఉపాధ్యాయ,పాఠశాల, విద్యారంగ సమస్యలను పరిష్కరించాలనికోరుతూ ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ ఆధ్వర్యంలో ఈనెల 5 న మెదక్ లో తలపెట్టిన ధర్నాను విజయవంతం చేయాలని యుఎస్పిసి నాయకులు కోరారు. ఈసందర్భంగా వారు కుర్తివాడలో ధర్నా పోస్టర్ ఆవిష్కరించారు. ఈసందర్భంగా టీఎస్‌యూటీఎఫ్, టిపిటీఎఫ్ నాయకులు మాట్లాడుతూ గతంలో ఇచ్చినహామీప్రకారం 5571పిఎస్ హెచ్ఎం పోస్టులను మంజూరు చేసి.. పదోన్నతులు ద్వారా నింపాలన్నారు. సర్వీస్ రూల్ రూపొందించి రెగ్యులర్ ఎంఈఓ లను నియమించాలని, నూతన పెన్షన్ విధానం రద్దు చేసి పాత పెన్షన్ విధానం పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. పెండింగ్ లో ఉన్న డిఏలను, పీఆర్‌సీని వెంటనే ప్రకటించాలని డిమాండ్ చేశారు. జిఓ317 కారణంగా స్థానికత కోల్పోయిన వారికి న్యాయం చేయాలని, వారిని సొంత జిల్లాలకు పంపాలని, జెడ్పిజిపిఎఫ్, టీఎస్‌జిఎల్ఐ, సరెండర్ లీవ్స్, పదవీవిరమణపొందిన ఉపాధ్యాయులకు విరమణ రోజునే రావలసిన అన్ని బకాయిలు చెల్లించాలి అని డిమాండ్‌చేశారు.. ఈ కార్యక్రమంలో టీఎస్‌యుటిఎఫ్ రాష్ట్ర కమిటీ సభ్యులు బత్తుల, భూషణం, జిల్లా కార్యదర్శి నాచారం శేఖర్, జిల్లా నాయకులు కె.వి.ఆర్ నాయుడు, మల్లేశం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## రైతుల సంక్షేమం పేరుతో రాజకీయం చేస్తున్న పార్టీలు

**–రైతు రక్షణ సమితి నాయకులు**

**నర్సాపూర్, ఆగస్టు 2, ప్రభాతవార్త:**

రైతుసంక్షేమం పేరుతో పలు రాజకీయ పార్టీలు రాజకీయాలు చేస్తున్నారని రైతుభద్రత కోసం శాశ్వత పరిష్కారాలు చూపడం లేదని మెదక్ జిల్లా రైతు రక్షణ సమితి అధ్యక్షులు పత్రాల యాదవగౌడ్, జిల్లా గౌరవ అధ్యక్షులు మైసయ్యయాదవ్, రైతురక్షణసమితి ముఖ్యసలహాదారులు మిర్యాల చంద్ర శేఖర్‌లు అన్నారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ అన్ని రాజకీయ పార్టీలు తమపాలనలో రైతులను ఆదుకుంటున్నామని గొప్పలు చెప్పుకో వడం తప్ప కానీ వాస్తవానికి అది జరగడం లేదన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రైతుల శాశ్వతభద్రతపై స్పష్టమైన దిశానిర్దేశంచేసి రైతులను అన్ని విధాలుగా ఆదుకోవాలని కోరుతున్నారు. ఈకార్యక్రమంలో మెదక్ జిల్లా రైతు రక్షణ సమితి అధ్యక్షులు పత్రాల యాదవగౌడ్, జిల్లా గౌరవ అధ్యక్షులు మైసయ్యయాదవ్, రైతురక్షణసమితి ముఖ్యసలహాదారులు మిర్యాల చంద్రశేఖర్‌లతోపాటు జిల్లా రైతు రక్షణ సమితి సభ్యులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## మహాసభను విజయవంతం చేయండి

**–సిపిఐ నాయకులు చిరంజీవి**

**నారాయణఖేడ్, ఆగస్టు 2, ప్రభాతవార్త:**

నేడు నారాయణఖేడ్‌లో జరిగే మహాసభను విజయవంతం చేయాలని నారాయణఖేడ్‌సిపిఐనాయకులు చిరంజీవి శనివారం ఒకప్రకటనలో పిలుపు నిచ్చారు. ఆగస్టు 3 ఆదివారం ఉదయం 11గంటలకు సంగారెడ్డి జిల్లా సిపిఐ పార్టీ మహాసభ సందర్భంగా నారాయణఖేడ్ పట్టణంలోని మా ఫంక్షన్ హాల్ నుండి కింగ్స్‌ప్యాలెస్ ఫంక్షన్‌హాల్ వరకు బైక్‌ర్యాలీ నిర్వ హించడం జరుగుతుందన్నారు. అనంతరం కింగ్స్‌ప్యాలెస్ ఫంక్షన్‌హాల్‌లో మహాసభ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుంది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, ఎమ్మెల్సీ సత్యం హాజరుకానున్నారని, కావున అందరు భాగస్వాములై తరలి రావాలని ఆయన పిలుపునిచ్చారు.

## మెదక్ జిల్లాకు 51 ఎఎల్ఎం పోస్టులు మంజూరి చేయాలి...

**–విద్యుత్ శాఖ మంత్రికి మాజీ ఎమ్మెల్యే శశిధర్ రెడ్డి వినతి...**

**పాపన్నపేట, ఆగస్టు 2, ప్రభాతవార్త:**

మెదక్ జిల్లాకు 51 అసిస్టెంట్ లైన్‌మెన్ పోస్టులు మంజూరి చేయాలని ఆర్థిక విద్యుత్ శాఖ మంత్రి భట్టి విక్రమార్కకు శనివారం విజ్ఞప్తి చేసినట్లు మెదక్ మాజీ ఎమ్మెల్యే శశిధర్ రెడ్డి తెలిపారు. జిల్లాలో 200 గ్రామాలకు సరిపడే ఏఎల్ఎంలు లేక విద్యుత్ సేవల ఇబ్బందులు ఏర్పడుతున్నాయన్నారు. ఈ మేరకు పాపన్నపేట మండలానికి 15,మెదక్పట్టణానికి 5, మనపూర్ 6, మెదక్6, రామాయంపేట5, చిన్నశంకరంపేట7, నిజాంపేటమండలానికి7 పోస్టులు మంజూరు చేయాలని కోరినట్లు తెలిపారు.

## అధికారంలో ఉండి పాదయాత్ర చేయడమా!

**–అందోలు మాజీ శాసనసభ్యులు చంటి క్రాంతికిరన్**

**జోగిపేట, ఆగస్టు 2, ప్రభాతవార్త:**

అసలు కాంగ్రెస్ పార్టీ పాదయాత్ర ఎందుకు చేస్తుందో వారికే స్పష్టత లేదని, జనహితపేరుతో చేస్తున్న పాదయాత్రకు జనాలనుంచి స్పందనే లేదని, అందుకే జనరహిత పాదయాత్రగా మారిందని అందోలు మాజీ శాసనసభ్యులు చంటి క్రాంతికిరన్ విమర్శించారు. శనివారం అందోలులోని ఓ ఫంక్షన్‌హాలులో పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. అధికారంలో ఉండి పాదయాత్ర చేయటం హాస్యాస్పదంగా ఉందన్నారు. మీనాక్షి నటరాజన్ ఏహోదాలో పాదయాత్ర చేస్తుందో తెలపాలన్నారు. ప్రస్తుతం కాంగ్రెస్‌పార్టీ పరిస్థితి పూర్తిగాదిగజారిపోయిందని, పార్టీక్యాడర్‌లో విశ్వా సాన్ని నింపేందుకే పాదయాత్రచేస్తున్నారని ఆయన విమర్శించారు.

## గద్దర్ వర్ధంతి సభను జయప్రదం చేయాలి

**–డిబిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి దాసరి ఏగొండస్వామి**

**గజ్వేల్ టౌన్, ఆగస్టు 2, ప్రభాతవార్త:**

ప్రజా యుద్ధనౌక గద్దర్ ద్వితీయ వర్ధంతి సభను జయప్రదం చేయాలని డిబిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి దాసరి ఏగొండస్వామి పిలుపునిచ్చారు. శనివారం గజ్వేల్ పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద గద్దర్ ద్వితీయ వర్ధంతి సభకు సంబంధించిన గోడపత్రికలను ప్రజా సంఘాల నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈనెల 6వ తేదీన గద్దర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో హైద్రాబాద్‌లోని రవీంద్రభారతిలో మధ్యాహ్నం2గంటల నుండి సాయంత్రంవరకు వర్ధంతిసభ జరుగుతుందని అన్నారు. కవులు, కళాకారులు, కర్షకులు, బహుజన విప్లవ సానుభూతి పరులు హాజరయ్యే ఈసభలో విద్యార్థులు, ఉపాధ్యాయులు, ఉద్యమ కారులు ప్రతిఒక్కరూపాల్గొని శ్రద్ధాంజలి ఘటించాలన్నారు. కార్యక్రమంలో బిఎస్పీ నాయకులు కనకప్రసాద్, మాజీ ఉపసర్పంచ్ ఆరేకులు, మంజీరా దళితసేవాసమితి జిల్లా అధ్యక్షుడు పి.కిరణ్, అంబేద్కర్‌సంఘం నాయ కుడు స్వామి తదితరులు పాల్గొన్నారు.

## తుజాల్‌పూర్‌లో తల్లిపాల వారోత్సవాల కార్యక్రమం



సమావేశంలో మాట్లాడుతున్న ఐసిడిఎస్ సూపర్వైజర్ లక్ష్మీనర్సమ్మ

**నర్సాపూర్ ఆగస్టు 2, ప్రభాతవార్త:**

నర్సాపూర్ మండలపరిధిలోని తుజాల్‌పూర్ గ్రామంలో శనివారం తల్లి పాలవారోత్సవాలను ఘనంగాజరుపుకున్నారు. ఈకార్యక్రమానికి ఐసిడిఎస్ సూపర్వైజర్ లక్ష్మీనర్సమ్మ హాజరయ్యారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి సంవత్సరం ఆగస్టు ఒకటో తేదీ నుండి ఏడవ తేదీ వరకు తల్లిపాల వారోత్సవాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఇందులోబాగంగానే ఈగ్రామంలో తల్లిపాలవారోత్సవాలు జరుపుకుంటు న్నట్లు తెలిపారు. ఈసందర్భంగా ఆమె తల్లిపాలవిశిష్టత గురించి మహిళ లకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్ లక్ష్మీ నర్సమ్మతోపాటు అంగన్వాడీటీచర్ నాగరాణి, స్రవంతి, ఏఎన్ఎం, ఆశ వర్కర్, గర్భిణీస్త్రీలు బాలింతలు మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి ఒక్కరూ చెట్లను నాటాలి

**హవేళీఘనపూర్, ఆగస్టు 2, ప్రభాతవార్త:**

చెట్లనునాటి వాటినికాపాడాని పాఠశాల ప్రిన్సిపల్ సృజన తెలిపారు. శనివారం మండలకేంద్రంలోనిమహాత్మజ్యోతిబాపూలే బీసీగురుకుల బాలుర పాఠశాలలో విద్యార్థులు వర్షాకాలంలో మొక్కలునాటాలి. అడవులుపెరగాలి అన్నసదుద్దేశంతో వందలసంఖ్యలో విత్తనబంతులు సైన్స్‌టీచర్ల ఆధ్వ ర్యంలో తయారుచేశారు. పిల్లలు తయారుచేసిన విత్తనబంతులను పాఠశా లకు దగ్గరలో ఉన్న బ్యాతోల్ తిమ్మాయిపల్లి అడవిలో విసిరేశారు. ఈ విత్తనబంతుల వలన అడవిలో వర్షం పడ్డప్పుడు అవి మొలకెత్తి వృక్షాలుగా ఎదుగుతాయని తద్వారా మనప్రకృతిని కాపాడుకున్న వాళ్లమవుతామని అందుకే విద్యార్థులచేత విత్తనబంతులు తయారుచేయించి విసిరేయించా మని పాఠశాల ప్రిన్సిపల్ సృజన తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ వార్డెన్ బుర్ర సంతోష్ సైన్స్ ఉపాధ్యాయులు సాయిబాబా, వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

# మమ్మల్ని గెలిపించిన కార్యకర్తలను స్థానిక సంస్థల ఎన్నికల్లో మేము గెలిపిస్తాం

**-జనహిత పాదయాత్రలో ఎంపి, ఎమ్మెల్యే**




మాట్లాడుతున్న ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి

**నారాయణఖేడ్ ఆగస్టు 2 ప్రభాతవార్త:**

సంగారెడ్డి జిల్లా అందోల్ నియోజకవర్గంలోని ఏఐసిసి ఇంచార్జ్ మీనాక్షినటరాజ్, టిపిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్‌గౌడ్ నేతృత్వంలో ఉమ్మడి మెదక్ జిల్లా ఆందోల్ నియోజకవర్గం తెలంగాణ రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహా ఆధ్వర్యంలో నిర్వహించిన జన హితపాదయాత్ర ముఖ్యనాయకుల సమావేశంలో జహీరా బాద్ పార్లమెంట్‌సభ్యులు సురేష్‌కుమార్‌శెట్కార్, నారా యణఖేడ్ ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి సంయు క్తంగా మాట్లాడుతూ.... నారాయణఖేడ్ కాంగ్రెస్‌పార్టీకి కంచుకోట అని ఆనాటినుండి నేటివరకు కార్యకర్తలు నాయకులు సంయుక్తంగా కష్టపడుతూ పార్టీకి అండ దండగా ఉంటూ కష్టసుఖాల్లో ఎంపీ, ఎమ్మెల్యేలను గెలిపిస్తూ నిరంతరం పార్టీ కోసం కష్టపడ్డ అర్హులైన కార్యకర్తలకు, నాయకులకు స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తరపున పోటీ చేసిన ఎంపీపీ, జెడ్పిటిసి, ఎంపిటిసి, సర్పంచ్, వార్డుమెంబర్లను గెలుపునకు మేము జోడుగుర్రాలవలె కార్యకర్తలకు నాయకులకు తోడుంటా మని ధీమా వ్యక్తంచేశారు. ఆర్టికల్ 371జెద్వారా కర్ణాటక లోని కొన్నిప్రాంతాలకు ఎక్కువనిధులు పొందుతున్నారని ఆర్టికల్ 371జెలో నారాయణఖేడ్ నియోజకవర్గన్ని కూడా చేర్చాలని సూచించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలో లేని పది సంవత్సరాలు పార్టీ కోసం, మాకోసం ఎంతో కష్ట పడి పార్టీని అధికారంలోకి తీసుకురావడానికి, మమ్మల్ని గెలిపించిన కార్యకర్తల కోసం ఇప్పుడు మేం అందరం కష్ట పడి పార్టీ కోసం కష్టపడ్డ ప్రతి కార్యకర్తను స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలిపించుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సంగారెడ్డి మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి, గిరిధార్‌రెడ్డి సెట్విన్‌చైర్మన్, శ్రీమతి త్రిష రాజనర్సింహా, పటాన్‌చెరు కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కట శ్రీనివాస్‌గౌడ్, నర్సాపూర్ కాంగ్రెస్‌పార్టీ ఇంచార్జి ఆవుల రాజిరెడ్డి, అంజయ్య, జిల్లా గ్రంథాలయ ఛైర్మెన్, నారాయణఖేడ్ నియోజకవర్గం ముఖ్య నాయకులు ప్రజా ప్రతినిధులు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## పథకాలను ప్రచారం చేస్తేనే ఎన్నికల్లో అనుకూలం

**-టిపిసిసి అధ్యక్షులు మహేష్‌కుమార్‌గౌడ్**




సమావేశంలోమాట్లాడుతున్న టిపిసిసి అధ్యక్షులు మహేష్‌కుమార్‌గౌడ్

**జోగిపేట, ఆగస్టు 2, ప్రభాతవార్త:**

పార్టీలో గ్రూపులుంటేనే మంచిదని పోటీతత్వం పెరుగుందని, అయితే అవి తమపరిధిని దాటొద్దని తెలంగాణ కాంగ్రెస్‌కమిటీ అధ్యక్షులు మహేష్ కుమార్‌గౌడ్ అన్నారు. శనివారం సంగుపేటలో నిర్వహించిన ముఖ్య కార్య కర్తల సమావేశంలో ఆయనమాట్లాడారు. సాధారణంగా పార్టీలో గ్రూపు లను అందరూ వ్యతిరేకిస్తారని, తాను అలాకాదని, గ్రూపులున్నా అవి పార్టీ కి నష్టం చేయకుండా నడుచుకుంటే పార్టీకి లాభం చేకూరుస్తుందని అన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులు విజయఢంకా మోగించేలా కార్యకర్తలు మరింత కష్టపడాలని ఆయన సూచించారు.

### పథకాల అమలు చేయడమే కాదు, విస్తృతంగా ప్రచారమూ చేసుకోవాలి..

**-మంత్రి దామోదర్ రాజనర్సింహా**

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అనేక అభివృద్ధిసంక్షేమ పథకాలను అమలు చేస్తుందని, అయితే వాటిని విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత పార్టీ కార్యకర్తలపైన ఉందని, అపుడే మనం రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో తిరుగులేని విజయాల్ని సాధించగలుగుతామని మంత్రి దామోదర్ రాజనర్సింహ అన్నారు. మనం చేపడుతున్న అభివృద్ధిసంక్షేమ పథకాలను లబ్దిదారులకు వివరించాలని, అలాగే గ్రామాలవారీగా పార్టీ కార్యకర్తలకు లబ్దిదారులతో నేరుగా సంబంధాలుండాలని తెలిపారు. కార్యక్రమంలో త్రిష, నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవ్‌రెడ్డి, ఎంపి సురేశ్‌షెట్కార్, మాజీ మంత్రి చంద్రశేఖర్, మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి, కాటా శ్రీనివాస్‌గౌడ్, నాయకులు ఉజ్వల్‌రెడ్డి, గిరిధర్‌రెడ్డి, రాజిరెడ్డి, సుహాసినిరెడ్డి, పిసిసి ఉపాధ్యక్షులు సంగమేశ్వర్, రంగ సురేష్‌గుప్త, పట్లోల్ల ప్రవీన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

**జోగిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శ్రమదానం...**

జనహిత కార్యక్రమంలో భాగంగా శనివారంనాడు ఉదయం ఏడున్నర గంటల నుంచి జోగిపేటలోని నెహ్రూ మెమోరియల్ డిగ్రీ కళాశాలలో ఏఐసిసి తెలంగాణ వ్యవహారాల ఇంఛార్జ్ మీనాక్షినటరాజన్, పిసిసి అధ్యక్షులు మహేష్‌కుమార్‌గౌడ్, రాష్ట్ర వైద్యఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహల ఆధ్వర్యంలో శ్రమదానంనిర్వహించారు. సుమారుగంటన్నర పాటు శ్రమదానం చేశారు. ఇందులో భాగంగా కళాశాల ఆవరణలో పేర్కొన్న చెత్తా చెదారాన్ని తొలగించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కలిసి వారు కాసేపు ముచ్చటించారు. విద్యార్థులు భవిష్యత్తులో ఏమవాలనుకుంటున్నారో తెలుసుకుని, నిబద్ధతతో పనిచేస్తే రాజకీయాల్లో కూడా ఎదగవచ్చని, నిజాయితీతో ప్రజలకు సేవ చేయాలనుకునే యువత రాజకీయాల్లోకి రావాలని సూచించారు.

## సబ్ కలెక్టర్‌ను సన్మానించిన విద్యాధికారులు



సబ్‌కలెక్టర్‌ను సన్మానిస్తున్న విద్యాధికారులు

**నారాయణఖేడ్, ఆగస్టు 2, ప్రభాతవార్త:**

నారాయణఖేడ్‌కు నూతన సబ్ కలెక్టర్‌గా నియామకమైన ఉమాహారతిని నారాయణఖేడ్ డివిజనల్ మండల విద్యాధికారులు శనివారం మర్యాద పూర్వకంగా కలిసి పూలబొకే అందజేశారు. విశ్వనాథ్ నారాయణఖేడ్, రాములు నిజామాపేట్ రాజశేఖర్, మనోర్, మన్మధ కిషోర్, నాగల్‌గిద్ద, రహీమొద్దీన్ కంగ్టి, నాగారం శ్రీనివాస్ సిర్గాపూర్ పాల్గొన్నారు.

## కాలనీలో సొంత నిధులతో డ్రైనేజ్ పనులు



డ్రైనేజ్‌పనులుచేయిస్తున్న మాజీవార్డు కౌన్సిలర్ లతరమేశ్‌యాదవ్

**నర్సాపూర్, ఆగస్టు 2, ప్రభాతవార్త:**

నర్సాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని రెండవ వార్డ్ మాజీ కౌన్సిలర్ ఎర్ర గొల్ల లతరమేష్‌యాదవ్ తన సొంత నిధులతోఅండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు చేయిస్తున్నారు. ఈ మేరకు కాలనీలో డ్రైనేజీ సక్రమంగా లేకపోగా కాలనీలోని మురికి నీరు అంతా రోడ్లపై పారుతుంది దీంతో కాలనీవాసులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. ఇందుకు స్పందించిన మాజీ వార్డ్ కౌన్సిలర్ లత రమేష్ యాదవ్ తన సొంత నిధులతో సుమారు 800 మీటర్ల దూరం లోఅండర్ గ్రౌండ్ డ్రైనేజ్ పనులు చేయిస్తున్నారు. ఈ అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ నిర్మాణ పనులు పూర్తయితే ఈ కాలనీలో మురికి నీరంతా రోడ్లపై రాకుండా ఉంటుంది. దీంతో కాలనీవాసుల రాకపోకలు ఎంతో సౌకర్యం ఏర్పడుతుంది. ఈమేరకు కాలనీవాసులు పడుతున్న అవస్థలు గమనించి స్పందించిన మాజీ వార్డ్ కౌన్సిలర్ లతరమేష్‌యాదవ్ స్పందించి ఈఅండర్‌గ్రౌండ్ డ్రైనేజ్ పనులు చేస్తుండడం పట్ల కాలనీవాసులు హర్షం వ్యక్తంచేస్తున్నారు. ఈసందర్భంగా మాజీ వార్డ్ కౌన్సిలర్ లతారమేష్‌యాదవ్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు.

## కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో అవినీతికి పాల్పడినవారికి శిక్ష తప్పదు

**-డిసిసి ప్రధాన కార్యదర్శి మీసం నాగరాజుయాదవ్**

**చిన్నకోడూరు, ఆగస్టు 2, ప్రభాతవార్త:**

కాళేశ్వరంప్రాజెక్టులో జరిగిన అవినీతిపైజరిపిన కమిషన్ రిపోర్టు ప్రభుత్వానికి అందిందని..అవినీతిలో భాగమైన ప్రతి ఒక్కరిపై ప్రభుత్వం చర్యలు తీసుకుం టుందని డిసిసి ప్రధానకార్యదర్శి మీసం నాగరాజ్‌యాదవ్ అన్నారు. చిన్న కోడూరులో శనివారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లా డారు. కాళేశ్వరంలో అవినీతికి పాల్పడినవారు రేపోమాపో జైలుకు వెళ్లడం ఖాయమన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులో భూములు కోల్పోయిన బాధిత రైతులకు సరైన పరిహారం ఇవ్వకుండా ఒకే ప్రాజెక్టు పరిధిలో భూములు కోల్పోతున్న రైతులకు రెండురకాల పరిహారాలు ఇచ్చి అప్పటి ప్రభుత్వం మోసం చేసిందన్నారు. సమావేశంలో పార్టీనాయకులు బత్తిని గణేష్‌గౌడ్, మహేందర్‌రెడ్డి, బర్ల స్వామి, గుడిమల్ల మల్లేశం, కర్నే శ్రీనివాస్‌రెడ్డి, పట్నం కనకయ్య, ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

## భారత జాతీయ పతాక రూపకర్తకు ఘన నివాళి



ఆవాలతో చిత్రించిన పింగళి వెంకయ్య చిత్రాన్ని చూపుతున్న రామరాజు

**గజ్వేల్ టౌన్, ఆగస్టు 2, ప్రభాతవార్త:**

భారతజాతీయపతాక రూపకర్త, స్వాతంత్రసమరయోధుడు పింగళి వెంకయ్య చిత్రాన్ని రామకోటి భక్తసమాజంసంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు రామకోటి రామ రాజు ఆవాలతో అద్భుతంగా చిత్రించి రామకోటి కార్యాలయంలో ఆవిష్కరించి ఘననివాళులర్పించారు. ఈసందర్భంగా రామరాజు మాట్లాడుతూ జాతీయ జెండా రూపకల్పనతో ప్రజల్లో దేశభక్తిని, జాతీయ భావాన్ని రగిలించి, తెలుగు వారి ఖ్యాతిని దేశవ్యాప్తంగా చాటారన్నారు. జాతీయోద్యమంలో కీలకపాత్ర వహించిన ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధులు పింగళి వెంకయ్య అన్నారు.

### ఘనంగా తల్లిపాల వారోత్సవాలు...

**రామాయంపేట, ఆగస్టు 2, ప్రభాతవార్త:**

రామాయంపేట పట్టణంలో శనివారం తల్లిపాల వారోత్సవాలు ఘనంగా జరిగాయి. అంగన్వాడీసెంటర్ శ్రీలో టీచర్ భాగ్యలక్ష్మి ్మ ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాలు అనంతరం ర్యాలీ నిర్వహించి తల్లిపాల ప్రాముఖ్యత గురించి గర్భిణీలకు తల్లులకు వివరించడం జరిగింది.

## తడి, పొడి చెత్తను వేరు చేయాలి

**-అడిషనల్ కలెక్టర్ నగేష్**



సిబ్బందికి సూచనలు చేస్తున్న అదనపు కలెక్టర్ నగేష్

**మెదక్ టౌన్, ఆగస్టు 2, ప్రభాతవార్త:**

రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు 100 రోజుల యాక్షన్ ప్లాన్‌లో భాగంగా శనివారం పట్టణంలోని వార్డ్ నెంబర్ 23,31లలో అడిషనల్ కలెక్టర్, మున్సిపల్ ప్రత్యేక అధికారి మున్సిపల్ కమిషనర్, సిబ్బందితో వార్డులో పర్యటించి ఇంటింటికీ తిరిగి తడి,పొడి,హానికరమైన చెత్తను వేరుచేసి మున్సిపల్ వాహనాలకు ఇవ్వాలన్నారు. చెత్తను ఎట్టి పరిస్థితుల్లో ఇంటి చుట్టుప్రక్కల వేయకూడదని, అవగాహన కల్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్, ప్రత్యేక అధికారి నగేష్, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి, ఇంచార్జ్ శానిటరీ ఇన్స్పెక్టర్ నాగరాజు, వెంకటేష్, వార్డు అధికారులు, సానిటరీ జవాన్లు, మున్సిపల్ సిబ్బంది, వార్డు ప్రజలు పాల్గొన్నారు.

## గీత కార్మికులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలి

**-కల్లుగీత కార్మిక జిల్లా అధ్యక్షుడు ఆశన్నగౌడ్**

**కొండాపూర్, ఆగస్టు 3, ప్రభాతవార్త:**

గీతకార్మికులకు ఇచ్చినహామీలను వెంటనే అమలుచేయాలని కల్లుగీత కార్మిక జిల్లా అధ్యక్షుడు ఆశన్నగౌడ్ అన్నారు. మండలపరిధిలోని గొల్ల పల్లి గ్రామంలో కల్లుగీత కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఆగస్టు రెండు నుండి 18 వరకు జిల్లా వ్యాపితంగా నిర్వహిస్తున్న అమరవీరుల స్ఫూర్తి తో శనివారం ముందుగా సర్దార్ సర్వాయి పాపన్న, మహాత్మ జ్యోతిరావు పూలే, చాకలి ఐలమ్మ విగ్రహాలకు పూలమాలలువేసి గీతన్నల సామాజిక చైతన్యయాత్రను ప్రారంభించారు. అక్కడనుండి బైక్ ర్యాలీ మల్కాపూర్ చౌరస్తావరకు నిర్వహించారు. ఈసందర్భంగా ఆశన్నగౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్‌గౌడ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఈత తాటి చెట్ల పెంపకంకు ప్రతి కల్లుగీత సొసైటీలకు ఐదు ఎకరాల ప్రభుత్వభూమి ఇవ్వాలని వాటి సంరక్షణ కోసం డ్రిప్పు బోరు మంజూరు చేయాలని కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 20 నెలలు గడుస్తున్న గీత కార్మికులకు గౌడ కులస్తులకు ఇచ్చిన హామీలను అమలు చేయడం లేదని వెంటనే హామీలను అమలుచేయాలని డిమాండ్‌చేశారు. కార్యక్రమంలో జిల్లాకమిటీసభ్యులు శ్రీనివాస్‌గౌడ్, కృష్ణగౌడ్, నాగరాజుగౌడ్, రామా గౌడ్, కటేశంగౌడ్, కుమార్‌గౌడ్, మల్కాపూర్ టిటిసిఎస్ అధ్యక్షులు ప్రభాకర్‌గౌడ్, గొల్లపల్లి టిటిసిఎస్ అధ్యక్షులు అనంతయ్యగౌడ్, బాలా గౌడ్, రామకృష్ణగౌడ్, వెంకటేశంగౌడ్, నరేందర్‌గౌడ్, రవిగౌడ్, నరసింహగౌడ్, అనంతరంగౌడ్, వెంకటయ్యగౌడ్, పాల్గొన్నారు.

## పేటకు కాశీ జగద్గురు పీఠాధిపతి ఆగమనం

**సదాశివపేట, ఆగస్టు 2. ప్రభాతవార్త:**

మల్లికార్జునస్వామి దేవాలయానికి విచ్చేస్తున్న కాశీ జగద్గురు పీఠాధిపతి చంద్రశేఖర శివాచార్యులు తనభక్తుల కోరికమేరకు శ్రావణమాస అను ష్ఠానం పురస్కరించుకొని 1008 డాక్టర్ చంద్రశేఖర శివాచార్యులవారు సదాశివపేట పట్టణానికి సోమవారం విచ్చేయుచున్నారు. మధ్యాహ్నం రెండుగంటలకు ఆయన శ్రీభ్రమరాంబసమేత మల్లికార్జునస్వామి దేవాల యానికి వస్తారని ఆలయానికిసంబంధించిన పూర్వవిద్యార్థుల మిత్ర బృందం అధ్యక్షుడు గంట శివయ్య మిత్రులు తెలిపారు. అక్కడ ఆయన మల్లికార్జునస్వామికి పత్రిపుష్పాలతో పూజలుచేసి మంగళహారతులు ఇస్తా రని అన్నారు. అనంతరం భక్తులు జగద్గురు పీఠాధిపతి శివాచార్యుల వారికి పాదపూజ చేసే కార్యక్రమం ఉంటుందని మిత్రబృందం సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో భక్తులు అధికసంఖ్యలో పాల్గొని జగద్గురు కృపకు పాత్రులు కాగలరని వారు కోరారు.

## రంగనాయకసాగర్ రిజర్వాయర్‌పై నిషేధిత ప్రాంతాల్లోకి వెళ్ళొద్దు

**-ఎస్ఐ సైఫ్ అలీ**




రక్షణచర్యల్లో భాగంగా ఫ్లెక్సీలను ఏర్పాటుచేస్తున్న ఎస్ఐ సైఫ్‌అలీ

**చిన్నకోడూరు, ఆగస్టు 2, ప్రభాతవార్త:**

మండల పరిధిలోని చంద్లాపూర్ గ్రామ శివారులోని రంగనాయకసాగర్ రిజర్వాయర్‌పై రక్షణచర్యల్లోభాగంగా శనివారం ఎస్ఐ సైఫ్‌అలీ ఆధ్వ ర్యంలో ఫ్లెక్సీలను ఏర్పాటుచేశారు. ఈసందర్భంగా ఎస్ఐ సైఫ్ అలీ మాట్లాడుతూ రంగనాయకసాగర్ రిజర్వాయర్‌లోనికివెళ్లి ఈతలుకొట్టడం, సెల్ఫీలుదిగడం, మోటార్‌సైకిల్ రైడింగ్ నిషేధించడం జరిగిందన్నారు. రిజర్వాయర్‌లో మొసళ్లు తిరుగుతున్నాయని జాగ్రత్తగా ఉండాలన్నారు. రిజర్వాయర్‌లో లోతైనగుంతలు ఉన్నాయని సందర్శకులువచ్చి ఆస్వా దించి వెళ్లాలితప్ప నిషేధితప్రాంతాలోకివెళ్లి ప్రాణాలమీదికి తెచ్చుకోవ ద్దన్నారు. ప్రాజెక్టుపైనచుట్టుపక్కలప్రదేశాలలో చట్టవ్యతిరేకమైన కార్యక్ర మాలునిర్వహిస్తే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## ఓపెన్‌స్కూల్ అడ్మిషన్ తేదీ పొడిగింపు

**చౌటకూర్, ఆగస్టు 2, ప్రభాతవార్త:**

ఓపెన్ స్కూల్ విధానంలో పదవతరగతి, ఇంటర్ అడ్మిషన్ పొందే వారికి ఎలాంటి అపరాధరుసుము లేకుండా ఈనెల 18వతేదీవరకు పొడి గించినట్టు చౌటుకూరు మండలపరిధిలోని శివంపేటపాఠశాల ప్రధానో పాధ్యాయులు వేదశ్రీ తెలిపారు. ఈఅవకాశాన్ని మహిళలు, చదువు మానేసిన విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. దరఖాస్తు కొరకు శివంపేట అధ్యయనకేంద్రంలో సంప్రతించాలన్నారు. మరిన్నివివరాలకై 9440889422 నెంబర్‌కు కాల్ చేయాలన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కరించకపోతే మున్సిపాలిటీ ముట్టడిస్తాం

**-బిజెపి సంగారెడ్డి జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి**

**-ప్రజా సమస్యలపై పటేల్‌గూడాలో మహాధర్నా**




మహాధర్నాలో మాట్లాడుతున్న గోదావరి అంజిరెడ్డి

**అమీన్‌పూర్, ఆగస్టు 2, ప్రభాతవార్త:**

అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలో విలీనమైన కిష్టారెడ్డిపేట, పటేల్‌గూడ కాలనీలలో రోడ్లు,డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉందంటూ అమీన్‌పూర్ మండల అధ్యక్షుడు ఆధ్వర్యంలో పటేల్‌గూడాలో నాయకులు, కార్యకర్తలు కలిసి శనివారం మహా ధర్నా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథి గా బిజెపి సంగారెడ్డి జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి, పటాన్‌చెరు అసెంబ్లీ కన్వీనర్ శ్రీనివాస్ గుప్తా ముఖ్యఅతిథిగా పాల్గొని మహాధర్నాలో పా ల్గొన్నారు. అనంతరం పెద్ద ర్యాలీ నిర్వహించారు.

**మున్సిపల్ ఆఫీస్‌ను ముట్టడిస్తాం..**

**–గోదావరి అంజిరెడ్డి**

సంగారెడ్డి జిల్లా బిజెపి అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి మాట్లాడుతూ స్థానిక ప్రజాప్రతినిధులు ఇప్పటికైనా మున్సిపాలిటీలో విలీనమైన పటేల్ గూడా, కిష్టారెడ్డిపేట అభివృద్ధిపై దృష్టి పెట్టాలని, లేనిపక్షంలో మున్సిపల్ ఆఫీస్‌ను పెద్ద ఎత్తున కార్యకర్తలతో ముట్టడిస్తామని, అలాగే జిల్లాస్థాయి కార్యక్రమాలు చేపడతామని తెలపడం జరిగింది. ఇన్నిరోజులు ఈప్రాంత ప్రజాప్రతినిధులు, అధికా రులు దోచుకున్నసొమ్మును కక్కించే బాధ్యత బిజెపి పార్టీ తీసుకుంటుందని అన్నారు.

**సిసిరోడ్లు వేస్తామంటూ డబ్బులు వసూలు..**

**–ఈర్ల రాజు**

పటేల్‌గూడాలోని వివిధకాలనీలో సిసిరోడ్లు వేస్తా మంటూ ఆయాకాలనీవాసులనుండి ప్రజా ప్రతిని ధులు డబ్బులు వసూలు చేయడం జరుగుతుందని ఈర్ల రాజు ఆరోపించారు. రాబోయేరోజుల్లో బిజెపి జెండా ఈప్రాంతంలో ఎగరవేయడం ఖాయమని తెలిపారు. ఎవరైతే మాజీ ప్రజాప్రతినిధులు అవినీతి, అక్రమాలకు పాల్పడ్డారో వాళ్ళ లెక్కలు తేల్చి ప్రజలముందు ఉంచుతామని హెచ్చరించారు. కిష్టారెడ్డిపేట పరిధిలోని దుర్గానగర్‌కాలనీ వాసు లకు కలెక్టర్ పార్కుస్థలం కేటాయించడం జరిగిం దని, పార్క్‌స్థలం గురించి స్థానికనాయకులు అడ్డు కోవడం జరుగుతుందని ఆవేదన వ్యక్తంచేశారు. ఇలాంటిరాజకీయాలుచేయడంసరికాదని ఈర్ల రాజు తెలిపారు. కార్యక్రమంలో బిజెపినాయకులు, వివిధ మోర్చా అధ్యక్షులు, కార్యకర్తలు కాలనీవాసులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## చంటి బిడ్డలకు తల్లిపాలు శ్రేయస్కరం

-డిపిహెచ్ఎన్ఓ మధులత



సమావేశంలో మాట్లాడుతున్న మధులత

**గుమ్మడిదల, ఆగస్టు 2, ప్రభాతవార్త:**

గుమ్మడిదల మున్సిపాలిటీ పరిధిలోని అన్నారం, వీరన్నగూడెం వార్డుల్లో తల్లిపాల వారోత్సవ కార్యక్రమాలను నిర్వహించారు. ఈకార్యక్రమానికి ముఖ్య అతిథిగా డిపిహెచ్ఎన్ఓ మధులత పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తల్లిపాల వారోత్సవాలను పురస్కరించుకొని ఆగస్టు 1నుంచి 7వ తేదీ వరకు అన్ని గ్రామాల్లో ప్రతి ఒక్కరికి తల్లిపాల ప్రాముఖ్యతను వివరించడానికి మండలం మున్సిపాలిటీ పరిధిలోని అన్ని వార్డులు గ్రామపంచాయతీలలో అంగన్వాడీ కేంద్రంలో నిర్వహించిన సమావేశానికి మహిళలు, బాలింతలు, గర్భిణీస్త్రీలు, ప్రతి ఒక్కరు వివిధిగా పాల్గొని అధికారులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, తల్లిపాల ప్రాముఖ్యత బిడ్డకు ఏవిధంగా అవసరం ఉంటుందో ప్రతి ఒక్కరు తెలుసుకోవాలని, అలాగే తల్లిపాల ప్రాముఖ్యత బిడ్డకు పౌష్టికాహారం, బిడ్డకు తల్లిపాల నుంచి లభించే ప్రోటీన్స్ ప్రాముఖ్యత తెలుసుకొని కల్పించాలని బిడ్డకు తల్లిపాలనే ఇవ్వాలనిసూచించారు. కార్యక్రమంలోమండలాధికారి ఎంపిహెచ్ ఓ.శ్రీనివాసరావు, ఓ.వసంత, ఎఎన్ఎం ఆశాకార్యకర్తలు, అంగన్వాడీ కార్యకర్తలు, బాలింతలు, గర్భిణీస్త్రీలు తదితరులు పాల్గొన్నారు.

## 179వ రోజుకు చేరుకున్న రిలే నిరాహారదీక్షలు




రిలే నిరాహార దీక్షల్లో పాల్గొన్న గ్రామస్తులు, మహిళలు

**గుమ్మడిదల, ఆగస్టు 2, ప్రభాతవార్త:**

ప్యారానగర్ డంపింగ్ యార్డు (ఎంఎస్‌డబ్ల్యు)కువ్యతిరేకంగా రిలే నిరాహార దీక్షలు చేస్తున్నా, రాష్ట్రప్రభుత్వం, జిల్లాయంత్రాంగం స్పందించకపోవడం అన్యాయమని నల్లవల్లి రైతు జెఏసి నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. గుమ్మడిదల మండలంలోని నల్లవల్లి గ్రామపంచాయతీ పరిధిలోని ప్యారానగర్ గ్రామశివారులో ఏర్పాటు కాబోతున్న డంపింగ్ యార్డును ప్రభుత్వం విరమించుకోవాలని డిమాండ్‌చేస్తూ చేపట్టిన రిలే నిరాహారదీక్షలు శనివారం 179వ రోజుకు చేరుకున్నాయి. గత ప్రభుత్వం ఇచ్చిన అనుమతులను ప్రస్తుతప్రభుత్వం వెంటనేరద్దుచేయాలని డిమాండ్‌చేశారు. తమకున్యాయం జరిగేవరకు పోరాటం చేస్తామని హెచ్చరించారు. ఈకార్యక్రమంలో రైతు జెఏసి నాయకులు, మహిళాసభ్యులు ప్యారానగర్, నల్లవల్లి, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో విగ్రహాల ప్రతిష్ఠాపన



విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమంలో ప్రసంగిస్తున్న మహారాజులు

**జహీరాబాద్, ఆగస్టు 2, ప్రభాతవార్త:**

పట్టణంలోని హౌసింగ్ బోర్డు వెంకటరమణ కాలనీలో నూతనంగా నిర్మించిన ఆలయంలో పోచమ్మ, బాలమ్మ, పోతురాజుల విగ్రహాల ప్రతిష్ఠాపన పూజాకార్యక్రమాలు నేత్రపర్వంగా నిర్వహించారు. శుక్రవారం విగ్రహాలను ఊరేగింపుగా ఆలయానికి తీసుకుపోయి హోమం, పూజా కార్యక్రమాలు నిర్వహించారు. శనివారం విగ్రహాలకు జలాధివాసం నిర్వహించారు. ఆలయ ప్రారంభోత్సవ కార్యక్రమాలకు న్యాల్‌కల్ మండలంలోని ముంగిగ్రామ శివారులోని శ్రీఆదిలక్ష్మి ఆశ్రమపీఠాధిపతి దేవగిరి మహారాజ్, ఝరాసంగం మండలంలోని మల్లన్నగట్టు పీఠాధిపతి డాక్టర్ బసవలింగం, అవధూతగిరి మహారాజ్‌లు పాల్గొన్నారు. ఆదివారం పోతురాజులచే బోనాల ఊరేగింపు కార్యక్రమం ఉంటుందని ఆలయ కమిటీ బాధ్యులు పేర్కొన్నారు.

## దివ్యాంగ విద్యార్థులకు హోం బేస్డ్ ఎడ్యుకేషన్



వికలాంగ విద్యార్థులకు బోధిస్తున్న విద్యాబోధనను పరిశీలిస్తున్న దృశ్యం

**కోహెడ, ఆగస్టు 2, ప్రభాతవార్త:**

మండలంలోని భవిత సెంటర్ ద్వారా ఎవరైతే పాఠశాలకు రాలేకుండా ఇంటివద్ద ఉండే దివ్యాంగ విద్యార్థులకు ప్రతి శనివారం నిర్వహించే ఇంటి వద్ద బోధనలో భాగంగా మండల పరిధిలోని తంగళ్లపల్లి గ్రామంలో హోమ్ బేస్డ్ ఎడ్యుకేషన్‌ని కమ్యూనిటీ మోబిలైజింగ్ ఆఫీసర్ రంగనాథ్ సందర్శించారు. వికలాంగులైన విద్యార్థులు విద్యాభ్యాసంలో వెనకబడకుండా ఉండడానికి ప్రతి శనివారం ఇంటి వద్ద బోధనను ఐఇఆర్పిలు చేస్తున్నారని తెలిపారు. ఇంటివద్ద వికలాంగ విద్యార్థులకు నిర్వహిస్తున్న విద్యా విధానాన్ని పర్యవేక్షించి సంతృప్తి వ్యక్తంచేశారు. కార్యక్రమంలో ఐఇఆర్‌పి సుమలత తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ గృహాలకు భూమిపూజ



ఇందిరమ్మ ఇళ్లకు భూమిపూజ చేస్తున్న దృశ్యం

**సదాశివపేట, ఆగస్టు 2, ప్రభాతవార్త:**

సదాశివపేట పట్టణంలోని 17వ వార్డులో శనివారం ఇందిరమ్మ గృహాలకు భూమిపూజ నిర్వహించడంజరిగింది. లబ్దిదారులు పోల రాధాబాయికి ఇందిరమ్మ ఇంటి మంజూరుపత్రం ఇవ్వడంజరిగింది. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్లు ప్రసన్నశంకర్‌గౌడ్, గుండు రవి, కాంగ్రెస్‌నాయకులు హాజీ, రఘు, వసీం, షజ్జి, తుకారం, మధు, యాదగిరి, జావిద్ పాల్గొన్నారు.

# చెరువులను కబ్జా చేస్తున్న రియాల్టర్లు

-చోద్యం చూస్తున్న ఇరిగేషన్ అధికారులు

-విలేకరులతో ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ నరోత్తం



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ నరోత్తం

**జహీరాబాద్, ఆగస్టు 2, ప్రభాతవార్త:**

జహీరాబాద్ ప్రాంతంలో ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఎరువులను, నాళాలతోపాటు ప్రభుత్వ భూములను కబ్జాచేస్తున్న ఇరిగేషన్ అధికారులు తమకేం పట్టనట్లుగా చోద్యం చూస్తున్నారని ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ వై. నరోత్తం ఆందోళనవ్యక్తంచేశారు. శనివారం పట్టణంలోని తనకార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో నరోత్తం మాట్లాడుతూ జహీరాబాద్ ప్రాంతంలో విచ్చలవిడిగా చెరువులు, నాళాలు యథేచ్ఛగా కబ్జాకు గురవుతున్నాయన్నారు. రియాల్టర్‌ల ముడుపులకు కక్కుర్తిపడిన అధికారులు ఎన్‌ఓసిలుజారీచేస్తూ వ్యాపారులు చెరువులను కబ్జా చేసుకునేందుకు అవకాశం కల్పిస్తున్నారని మండిపడ్డారు. బైపాస్ నుంచి అల్గోల్ భరత్‌నగర్‌కు వెళ్లే రోడ్డుమార్గంలో నిర్మించిన కల్వర్టుబ్రిడ్జినుంచి వరద నీరు బయటకువెళ్లకుండా అక్రమవ్యాపారులు గోడలు కట్టారని గుర్తుచేశారు. కబ్జాలకు పాల్పడుతున్న అక్రమవ్యాపారులకు అధికారపార్టీ నాయకుల అండదండలు పుష్కలంగా ఉన్నాయని పేర్కొన్నారు. కబ్జాలకుపాల్పడుతున్న వ్యాపారులపై జిల్లా అధికారులు చర్యలు తీసుకోవాలని నరోత్తం డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గౌడసంఘం తాలుకా అధ్యక్షులు మణిక్‌ప్రభుగౌడ్, నాయకులు శివకుమార్ ఈశ్వరప్ప, విష్ణువర్ధన్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి ఉన్నారు.

# యోగా మానసిక ఒత్తిడిని దూరం చేస్తుంది

-మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావు




మహిళా యోగ పోటీ కార్యక్రమంలో మాట్లాడుతున్న హరీష్‌రావు

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:**

యోగా ప్రతి ఒక్కరిలో మానసిన ఒత్తిడిని దూరం చేస్తుందని..యోగా చేయడం ద్వారా ఆరోగ్యాన్ని శరీరాన్ని బాగా ఉంచుకోవచ్చునని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్‌రావు అన్నారు. జిల్లా కేంద్రంలోని విపంచి కళానిలయంలో శనివారం నిర్వహించిన మహిళా యోగాపోటీకార్యక్రమంలో ఆయనపాల్గొని మాట్లాడారు.ప్రతిఒక్కరూ యోగా, వాకింగ్‌చేయడం అలవర్చుకోవాలన్నారు. ఆరోగ్య సిద్దిపేట..అభివృద్ధి సిద్దిపేట, ప్రజల ఆరోగ్యంగా ఉంటేనే అది నిజమైన అభివృద్ధి అని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్‌చైర్మన్ మంజుల, కమిషనర్ ఆశ్రిత్ కుమార్, యోగాపోటీ నిర్వాహకులు, బిఆర్ఎస్ శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.

**వేంకటేశ్వరదేవాలయంలో ప్రత్యేకపూజలు..**

సిద్దిపేట జిల్లాకేంద్రంలోని శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయంలో మాజీమంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావు శ్రావణమాసం సందర్భంగా నిర్వహించే పవిత్ర ఉత్సవాల్లో పాల్గొని స్వామికి వారికి ప్రత్యేకపూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో నిర్మిస్తున్న అన్నదాన సత్ర నిర్మాణ పనులను పరిశీలించారు. భవనానికి అవసరమయ్యే గ్రానైట్‌ను విరాళంగా అందిస్తానని తెలిపారు. ఆలయంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. అనంతరం శ్రావణమాసం సందర్భంగా పట్టణంలోని శ్రీసంతోషిమాత దేవాలయ వార్షికోత్సవంలోభాగంగా అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఆలయాన్ని అన్నివిధాలుగా అభివృద్ధిచేస్తానని తెలిపారు.

## బిసిలను మోసంచేస్తున్న కాంగ్రెస్ సర్కార్

-ధర్నాలో బిజెపి ఎమ్మెల్సీ అంజిరెడ్డి



ధర్నాచౌక్‌లో నిర్వహించిన ధర్నాలో పాల్గొన్న బిజెపి ఎమ్మెల్సీ అంజిరెడ్డి

**రామచంద్రాపురం, ఆగస్టు 2, ప్రభాతవార్త:**

బిసిలను కాంగ్రెస్‌సర్కార్ మోసంచేస్తోందని భారతీయజనతాపార్టీ పట్టభద్రుల ఎమ్మెల్సీ చిన్నమైల్ అంజిరెడ్డి ధ్వజమెత్తారు. శనివారం హైద్రాబాద్‌లోని ధర్నాచౌక్‌లో రాష్ట్రబిజెపి, ఓబిసిమోర్చా ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నాలో అంజిరెడ్డిపాల్గొని ప్రసంగించారు. కాంగ్రెస్‌చేసిన హామీలను అమలుచేయాలని ప్రభుత్వానికి హితవు పలికారు. బిసిల హక్కుల కొరకు బిజెపి పోరాటంచేస్తుందన్నారు. కార్యక్రమంలో సంగారెడ్డిజిల్లా బిజెపి పార్టీ అధ్యక్షురాలు చిన్నమైల్ గోదావరి అంజిరెడ్డి, బిసి సంక్షేమ సంఘాల నాయకులు, ఎంపిలు, బిజెపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## కేంద్రీయ విద్యాలయంలో ఇన్వెస్టిచర్ కార్యక్రమం



విద్యార్థినాయకులకు బ్యాడ్జీలుపెడుతున్న ఎస్ఐ పాటిల్ క్రాంతికుమార్

**ఝరాసంగం, ఆగస్టు 2, ప్రభాతవార్త:**

మండలపరిధిలోని మాచ్నూర్ గ్రామశివారులోని పిఎంశ్రీ కేంద్రీయ విద్యాలయంలో 2025-26 విద్యాసంవత్సరానకి సంబంధించి నియమితులైన విద్యార్థినాయకులకు ఇన్వెస్టిచర్‌కార్యక్రమాన్ని శనివారం ఆనందోత్సాహాలతో ఘనంగా జరుపుకున్నారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఝరాసంగం ఎస్ఐ పాటిల్ క్రాంతికుమార్ విద్యార్థినాయకులకు బ్యాడ్జీలు బహూకరించి ప్రసంగించారు. విద్యార్థుల్లో నాయకత్వలక్షణాలు, బాధ్యతగల స్వభావం పెంపొందించేందుకు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు గుర్తుచేశారు. విద్యార్థి నాయకులు తమ బాధ్యతలను నిబద్ధతతో నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మహేష్, వాసికర్ల, ఉపాధ్యాయులు ప్రతిభ, స్వప్న, తేజ, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## మీనాక్షినటరాజన్‌ను కలిసిన డిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్



మీనాక్షినటరాజన్‌కు కలుసుకున్న డిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ శ్యామ్‌రావు

**రామచంద్రాపురం, ఆగస్టు 2, ప్రభాతవార్త:**

జనహిత పాదయాత్ర నిర్వహిస్తున్న రాష్ట్ర కాంగ్రెస్ వ్యవరహారాల ఇంచార్జి మీనాక్షినటరాజన్‌ను శనివారం డిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ పర్స శ్యామ్‌రావు పార్టీనాయకులతో కలిసి మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. కార్యక్రమంలో రాష్ట్ర భవన నిర్మాణ కార్మిక సంఘం ఐఎన్‌టియుసి జిల్లా అధ్యక్షులు కొల్కూరి నర్సింహారెడ్డి, మాజీసర్పంచ్ శ్రీనివాస్, తెల్లాపూర్ కాంగ్రెస్‌నాయకులు నవారి శ్రీనివాస్‌రెడ్డి, అమీన్‌పూర్‌మున్సిపాలిటీ కాంగ్రెస్‌నాయకులు మెరుగు రవి గౌడ్, శ్రీకాంత్, గుమ్మడిదలనాయకులు తులసీరామదాసు పాల్గొన్నారు.

## పరిసరాలు అపరిశుభ్రంగా ఉంచితే చట్టరీత్యా చర్యలు

-అందోలు-జోగిపేట మున్సిపల్ కమిషనర్ ఎ.రవీందర్



వార్డులలో పారిశుధ్యాన్ని పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ ఎ.రవీందర్

**జోగిపేట, ఆగస్టు 2, ప్రభాతవార్త:**

తమపరిసరాలు అపరిశుభ్రంగా ఉంచుకొని ఇతరులకు హానికలిగించేలా ఉంచితే, అలాంటివారిని గుర్తించి వారికి నోటీసులు అందచేస్తానని, చట్టరీత్యా అవసరమైనచర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ రవీందర్ హెచ్చరించారు. ప్రతిరోజు డ్రైడే కార్యక్రమంలోభాగంగా మున్సిపాలిటీలో శుక్రవారం 17,18వార్డులలో ఇంటింటికీతిరుగుతూ అంటువ్యాధులు ప్రబలుతున్నందున ప్రతిఒక్కరు పరిశుభ్రత పాటించాలని సూచించారు. ఎవరైనా ఇతరులకు హాని కలిగేలా పరిసరాలు అపరిశుభ్రంగా ఉంచుతారో, వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని, ప్రతిరోజు ఆశావర్కర్లు, మున్సిపల్ ఆర్పీలు పరిశుభ్రతను పర్యవేక్షిస్తారని తెలిపారు. కార్యక్రమంలో హెల్త్‌సూపర్‌వైజర్లు ప్రమీల, రాణి, శానిటరీ ఇన్స్‌పెక్టర్ వినయ్, మెప్మా టిఎంసి బిక్షపతిగౌడ్, ఎఎన్ఎం సుజాత తదితరులు పాల్గొన్నారు.

# కోదండ రామాలయాన్ని దేవాదాయ శాఖలో విలీనం చేయడం దుర్మార్గం

-మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి



ధర్నాలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి

**మెదక్ టౌన్, ఆగస్టు 2, ప్రభాతవార్త:**

భక్తుల మనోభావాలు దెబ్బతీసేలా కోదండరామాలయాన్ని దేవాదాయశాఖలో విలీనంచేయడం దుర్మార్గమైనచర్య అని బిఆర్ఎస్‌జిల్లాఅధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి మండిపడ్డారు. అఖిలపక్షం ఆధ్వర్యంలో ఉద్యమం ఉధృతం చేస్తామన్నారు. మెదక్‌జిల్లాకేంద్రంలోని కోదండరామాలయాన్ని దేవాదాయశాఖలో విలీనాన్ని నిరసిస్తూ శనివారం రామాలయం ముందు రహదారిపై బిఆర్ఎస్‌నాయకులు, భక్తులతో బైఠాయించి రాస్తారోకో చేపట్టారు. ఈసందర్భంగా పద్మాదేవేందర్‌రెడ్డి మాట్లాడుతూ, పట్టణప్రజలు, భక్తుల విరాళాలతో 49సంవత్సరాలక్రితం నిర్మించుకున్న దేవాలయానికి ప్రభుత్వం నేటివరకు ఎలాంటి సహాయసహకారాలు అందించలేదన్నారు. దినదినాభివృద్ధి చెందిన రామాలయంలో ప్రతి సంవత్సరం సీతారాముల కల్యాణం, వేడుకలతోపాటు శ్రావణమాస తదితర పూజలు భక్తులసహకారంతోపాటు దేవాలయకమిటీ ఆధ్వర్యంలో ఘనంగా కొనసాగుతున్నాయన్నారు. ఎలాంటినోటీసులు ఇవ్వకుండా ఉదయం 7గంటలకు పోలీసుల బందోబస్తుతో దేవాదాయశాఖ అధికారులు హుండీతోపాటుదర్శసత్రాన్ని సీజుచేయడం సరికాదన్నారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ మల్లికార్జున్‌గౌడ్, లావణ్యారెడ్డి, ఆంజనేయులు, కృష్ణారెడ్డి, మాజీ కౌన్సిలర్లు జయరాజు, శ్రీనివాస్, బిఆర్ఎస్ నాయకులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## ఆంజనేయస్వామి ఆలయంలో అన్నదానం

**మనూర్, ఆగస్టు 2, ప్రభాతవార్త:**

మండల కేంద్రమైన మనూర్‌లోని ఆంజనేయస్వామి ఆలయంలో శనవారం గ్రామస్థులు ప్రత్యేకపూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయంలో ప్రతి శనివారం గ్రామస్థులు అన్నదానం చేస్తూ వస్తున్నారు. కార్యక్రమంలో భాగంగా శనివారం గ్రామానికి చెందిన మర్పల్లి ప్రియాంక సంగారెడ్డి దంపతుల సహకారంలో ఆలయానికి చేరుకున్న భక్తులకు తీర్థ ప్రసాదాలు (అన్నదానం) వితరణచేశారు. అన్నదానం చేసిన దాతలను గ్రామస్థులు ఘనంగా సత్కరించారు.

## గంజయి సాగు చేస్తే కఠినచర్యలు

-ఎస్ఐ రామకృష్ణ



ఇరక్‌పల్లిలో వ్యవసాయ పంటలను పరిశీలిస్తున్న ఎస్ఐ రామకృష్ణ

**నాగల్‌గిద్ద, ఆగస్టు 2, ప్రభాతవార్త:**

గంజాయిని సాగుచేస్తే కఠినచర్యలు తప్పవని ఎస్ఐ రామకృష్ణ హెచ్చరించారు. శనివారం మండలపరిధిలోని ఇరక్‌పల్లి, మేఘ తాండ, కూబ తండాల శివారులో సాగవుతున్న పంటలను ఎస్ఐ పరిశీలించారు. పంటలసాగులో అంతర్‌పంటగా గంజాయిని సాగుచేస్తుంటారని, అందుకు పంటలను పరిశీలించామని ఎస్ఐ పేర్కొన్నారు. పంటలసాగులో గంజాయిని సాగుచేస్తే పోలీసులకు సమాచారం అందించాలని, సమాచారం ఇచ్చినవారిపేర్లు గోప్యంగా ఉంచుతామని సూచించారు.

## గంజాయి సాగు చేసినా, రవాణా చేసినా చర్యలు తప్పవు

-ఎస్సై దుర్గారెడ్డి..

**కంగ్టి, ఆగస్టు 2, ప్రభాతవార్త:**

మండలంలో ఎవరైనా గంజాయిని సాగుచేసినా, రవాణాచేసినా, ఎవరికైనా అమ్మినా, లేదా ఎవరిదగ్గరైనాకొన్నా కేసు నమోదుచేసి జైల్‌కు పంపించడం జరుగుతుంది అని ఎస్సై దుర్గారెడ్డి అన్నారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వంనుండి వచ్చే ఉచితపథకాలు రద్దుచేయబడునని, రైతుబంధు, కరెంట్‌కనెక్షన్, పంటబీమాలాంటి అన్నిగవర్నమెంట్ పథకాలు నిలిపివేయబడునని తెలిపారు. వారిపై ప్రత్యేక నిఘా ఉంచబడునని, ఎవరైనా పత్తిచేనులోగానీ, కందిచేనులోగానీ అంతర్‌పంటగా గంజాయి సాగుచేసినట్లు ఎవరికన్నా సమాచారం తెలిస్తే వెంటనే పోలీస్‌వారికి తెలియజేయాలని ఎస్సై దుర్గారెడ్డి తెలిపారు. ఇటీవల దేగుల్వాడి గ్రామంలో సందర్శించిన సందర్భంగా పైనతెలిపిన సమాచారాన్ని సూచించడం జరిగిందన్నారు.

## విద్యార్థుల అవస్థలు పడుతున్నా పట్టించుకోరా?

-జూనియర్ సివిల్ జడ్జ్ న్యాయమూర్తి ఎం.హేమలత

-ప్రభుత్వప్రాథమికపాఠశాలను ఆకస్మికంగా తనిఖీచేసిన న్యాయమూర్తి



పాఠశాల గదులను పరిశీలిస్తున్న న్యాయమూర్తి ఎం.హేమలత

**నర్సాపూర్ ఆగస్టు 2, ప్రభాతవార్త:**

శిథిలమైపోయి ప్రమాదకరంగా మారిన గదులలో విద్యాబోధన ఎలా చేస్తారని, అదేవిధంగా పాఠశాలల్లో మరుగుదొడ్లు లేక విద్యార్థులు అనేక ఇబ్బందులు పడుతున్నా పట్టించుకోరా అని జూనియర్ సివిల్ జడ్జ్, మండల్ లీగల్ సర్వీస్ కమిటీ చైర్మన్ నర్సాపూర్ న్యాయమూర్తి ఎం.. హేమలత ఆగ్రహం వ్యక్తంచేశారు. శనివారం నర్సాపూర్‌లోని జిల్లా ప్రాథమిక పాఠశాలను, జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాలను ఆకస్మికంగా తనిఖీచేసి పాఠశాలగదులను న్యాయమూర్తి పరిశీలించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి ఎం.హేమలత మాట్లాడుతూ నర్సాపూర్‌లోని జిల్లా ప్రాథమికపాఠశాలలో మరుగుదొడ్లులేక విద్యార్థులు అనేక అవస్థలు పడుతున్నారని అన్నారు. ఇటీవల పాఠశాలకుచెందిన ఇద్దరు విద్యార్థులు మరుగుదొడ్లు లేనందున వర్షంలో తడుచుకుంటూ కోర్టు సమీపంలో ఉన్న నల్లావద్దకు వచ్చారన్నారు. ఇదే సమయంలో వర్షం పడుతుండగా తడిసిపోయి ఉన్న విద్యార్థులను చూసి వారినిపిలిచి మీరు ఇక్కడికి ఎందుకు వచ్చారని న్యాయమూర్తి అడగగా పాఠశాలలో మరుగుదొడ్లు లేక ఇక్కడికివచ్చామని చెప్పారన్నారు. ఈమేరకు స్పందించిన న్యాయమూర్తి ఎం.హేమలత కోర్టుసిబ్బందిచే కొత్తబట్టలు తెప్పించి ఇచ్చారు. న్యాయమూర్తి ప్రాథమిక పాఠశాలను సందర్శించి పాఠశాల సిబ్బందిని పిలిపించి విద్యార్థులను ఎందుకుబయటకుపంపించారని, వారికి ఏమైనా జరిగితే ఎవరుబాధ్యులని ఆమె ఆగ్రహంవ్యక్తంచేశారు. అంతేగాక పాఠశాల గదులన్నీ శిథిలమైపోయాయని ఈప్రమాదకరగదులలో విద్యాబోధన ఎలాచేస్తున్నారని ప్రశ్నించారు. ఈవిషయమై జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఈసమస్యల పరిష్కారం కోసం చర్యలు తీసుకుంటానని హేమలత వెల్లడించారు. ఈకార్యక్రమంలో ప్రధాన ఉపాధ్యాయులు, ఉపాధ్యాయులు, కోర్టు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## వంగదాల్‌లో తల్లిపాల వారోత్సవం

**సిర్గాపూర్, ఆగస్టు 2, ప్రభాతవార్త:**

మండల పరిధిలోని వంగదాల్ గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రం ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా తల్లులు, బాలింతలు, గర్భిణీలతో అంగన్‌వాడీ టీచర్‌లు సుజాత, కాంతమ్మ ప్రత్యేకంగా సమావేశం అయి తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. పుట్టిన బిడ్డ ఆరోగ్యంగా ఉండేందుకు తల్లి తన చిన్నారికి ముర్రుపాలను తాగించాలన్నారు. ముర్రుపాలలో రోగనిరోధక శక్తి ఉంటుందన్నారు. కార్యక్రమంలో టీచర్లు స్నేహ, భావన, ఆయాలు తదితరులు ఉన్నారు.

## గంజాయి సాగుచేస్తే కఠిన చర్యలు



రైతులు సాగుచేస్తున్న పంటలను తనిఖీచేస్తున్న ఎస్ఐ కోటేశ్వరరావు

**మనూర్, ఆగస్టు 2, ప్రభాతవార్త:**

గంజాయిని సాగుచేసినవారిపై కఠినచర్యలు తప్పవని ఎస్ఐ కోటేశ్వరరావు హెచ్చరించారు. శనివారం మండలపరిధిలోని ఆయా గ్రామాల్లో రైతులుపండిస్తున్న పంటలను ఎస్ఐ తనసిబ్బందితో కలిసి పరిశీలించారు. ఈసందర్భంగా ఎస్ఐ కోటేశ్వరరావు మాట్లాడుతూ పంటలసాగుతోపాటు అంతర్‌పంటగా గంజాయిసాగుచేసే ఆస్కారం ఉందని అందుకు పంటలను పరిశీలించామన్నారు. గంజాయిని సాగుచేస్తున్నట్లు గుర్తిస్తే పోలీసులకు (8712656758) సమాచారం అందించాలని, సమాచారం ఇచ్చినవారిపేర్లు గోప్యంగా ఉంచుతామన్నారు. సమాజ శ్రేయస్సును దృష్టిలో పెట్టుకుని గంజాయి సాగుకాకుండా చూసుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని గుర్తుచేశారు.